# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

<u>పత్రికా ప్రకటన</u>

**జూన్ 20, 2011**

## ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల ఉద్యమ సంస్థాపక నేతల్లో ఒకరైన పత్తిపాటి వెంకటేశ్వర్లుకు అరుణారుణ జోహార్లు!

ప్రజా న్యాయవాది, ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం (ఏపీసీఎల్‌సీ) సంస్థాపక కార్యదర్శి పత్తిపాటి వెంకటేశ్వర్లు జూన్ 11, 2011న తుదిశ్వాస విడిచారు. ఆయన మరణంతో భారత పీడిత ప్రజానీకం, ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్ ప్రజానీకం ఒక శ్రేయోభిలాషినీ, ప్రజా న్యాయవాదినీ, తమ హక్కుల కోసం అవిశ్రాంతంగా పోరాడిన పౌరహక్కుల నేతనూ కోల్పోయారు. భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్రకమిటీ పత్తిపాటికి అరుణారుణ జోహార్లు అర్పిస్తున్నది. ఆయన కుటుంబసభ్యులకూ, స్నేహితులకూ, బంధువులకూ, పౌరహక్కుల వుద్యమ సహచరులకూ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నది.

పత్తిపాటి 1934లో ప్రకాశం జిల్లాలోని టంగుటూరులో జన్మించారు. దేశంలో మహత్తర నక్సల్బరీ పోరాట కాలంలో, ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌లో శ్రీకాకుళం పోరాటం సందర్భంగా పీడిత ప్రజల, పోరాడే ప్రజల హక్కుల కోసం వుద్యమించడానికి ముందుకొచ్చిన అనేక ప్రజాసంఘ నాయకుల్లో పత్తిపాటి ఒకరు. వెంగళరావు ఫాసిస్టు పాలనలో శ్రీకాకుళ వుద్యమాన్ని అణిచివెయ్యడం కోసం బూటకపు ఎన్‌కౌంటర్లు తీవ్రతరం కావడం, విప్లవకారులపై, సామాన్య ప్రజలపై పోలీసు, పారామిలిటరీ కిరాయి మూకలు లెక్కలేనన్ని హింసాదౌర్జన్యాలకు, అరెస్టులకు పాల్పడడంతో 1970వ దశకంలో పౌరహక్కుల వుద్యమం ఆవశ్యకత మునుపెన్నటికన్నా బాగా ముందుకొచ్చింది. 1973లో ఏర్పడిన ఏపీసీఎల్‌సీకి పత్తిపాటి తొలి కార్యదర్శి కాగా, మహాకవి కవి శ్రీశ్రీ దానికి తొలి అధ్యక్షులయ్యారు. వాళ్లిద్దరూ ఆంధ్రప్రదేశ్ నలుమూలలా పర్యటించి బలమైన పౌరహక్కుల వుద్యమాన్ని నిర్మించడానికి ఎంతో పాటుపడ్డారు. ఆ కాలంలో వాళ్లిద్దరి పేర్లు హక్కుల వుద్యమానికి చిరునామాగా మారాయి. పత్తిపాటి తన ఉత్తేజకరమైన వుపన్యాసాలకు ప్రసిద్ధి. ప్రభుత్వ క్రూర ముఖాన్నీ, దాని ఫాసిస్టు అణిచివేత స్వభావాన్నీ ఆయన తన ప్రసంగాల్లో బాగా ఎండగట్టేవారు. ఆయన రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ఏపీసీఎల్‌సీ యూనిట్లను నిర్మించడానికీ, సంస్థను బలోపేతం చేయడానికీ ఏకవ్యక్తి సైన్యంగా పాటుపడ్డారంటే అతిశయోక్తి కాదు. 1970 నుండి 1975 మధ్య కాలంలో రాజ్యహింస బాధితులంతా ఆయన వద్దకే వెళ్లేవారు ఎందుకంటే ఆయన ఒక న్యాయవాదే కాకుండా వాళ్లకోసం అంకితమై పోరాడే ఫైర్‌బ్రాండ్ పౌరహక్కుల నేత కూడా. హైద్రాబాద్‌లో ఇసామియా బాజార్‌లోని ఆయన ఇల్లు ప్రజాసంఘాల కార్యకర్తలు, రాజ్యహింస పీడితులు, తప్పుడు కేసుల్లో ఇరికించబడ్డవాళ్లు, విప్లవ రచయితలు, పౌరహక్కుల కార్యకర్తలు మొదలైన వాళ్లందరికీ ఒక సమావేశస్థలంగా వుండేది. దాదాపు ప్రతిరోజూ ఎందరో అక్కడ ఆయనతో కలిసి వున్నదేదో తిని, ఆశ్రయం పొందుతూ, విప్లవ భావాల్ని ఇచ్చిపుచ్చుకునేవారు.

1974లో ఉరిశిక్ష విధించబడ్డ విప్లవ రైతాంగ వుద్యమ కార్యకర్తలు కామ్రేడ్స్ భూమయ్య, కిష్టగౌడ్‌ల శిక్షలను రద్దు చేయాలనే డిమాండ్‌తో జరిగిన పోరాటంలో, దాన్ని దేశవ్యాప్త సమస్యగా మల్చడంలో పత్తిపాటి పోషించిన పాత్ర చిరస్మరణీయంగా నిలుస్తుంది. వాళ్ల ఉరిశిక్ష రద్దు కోసం సాగిన వుద్యమంలో జయప్రకాశ్ నారాయణ, చంద్ర రాజేశ్వరరావు, భూపేష్ గుప్తా, వాజ్‌పేయి, జార్జ్ ఫెర్నాండెజ్ తదితర వేర్వేరు రాజకీయ పార్టీల నాయకుల్ని కూడా కలుపుకురావడంలో ఆయన కీలకపాత్ర పోషించారు. ఈ డిమాండ్‌తో ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి దాన్ని ఆయన హైద్రాబాద్ నుండి సమన్వయించారు. ప్రత్యేకించి ఈ డిమాండ్‌కు అంతర్జాతీయ స్థాయిలో సంఘీభావాన్ని కూడగట్టడంలో ఆయన చేసిన కృషి ఎంతో ప్రశంసనీయమైంది. ఈ డిమాండ్‌కు మద్దతుగా ప్రపంచవ్యాప్తంగా 300కు పైగా మేధావులు (జీన్ పాల్ సార్త్రే, తారిఖ్ అలీ సహా) ఫ్రాన్స్, అమెరికా తదితర దేశాల్లో ప్రదర్శనలు జరిపారు. ఆయన ఈ కేసును వాదించడంతో పాటు, మొదటిసారి వాళ్లను వురి తీయాలని ప్రభుత్వం ప్రయత్నించినపుడు స్టే తెప్పించాడు. ప్రపంచవ్యాప్తంగా మరణశిక్షలకు వ్యతిరేకంగా నిర్మాణమవుతున్న వుద్యమాలు ఆయనను సదా స్మరించుకుంటాయి.

1975 జూన్ 25-26 మధ్యరాత్రి ఎమర్జెన్సీ విధించిన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో అరెస్టయిన మొట్టమొదటి రాజకీయ కార్యకర్త, పౌరహక్కుల నాయకుడు పత్తిపాటి గారే. ఆయన కుటుంబం పూర్తిగా ఆయన పైననే ఆధారపడేది కావడం వల్ల ఆయన జైలు నిర్బంధంలో

వున్న కాలంలో వారు ఎన్నో ఇబ్బందులకు, కష్టాలకు గురయ్యారు. జైలులో వున్న కాలంలో కూడా పత్తిపాటి ఫోన్‌కాల్స్ చేస్తూ, వుత్తరాలు రాస్తూ, టెలిగ్రాంలు పంపుతూ పౌరహక్కుల కార్యకలాపాల్ని సమన్వయించడంతో ప్రభుత్వం వీటిని నిషేధిస్తూ ఒక ప్రత్యేక జీ.వో.ను జారీ చేయాల్సి వచ్చింది. 1970–77 మధ్య కాలంలో ఎందరో విప్లవకారులు, వందలాది కార్యకర్తలు అక్రమంగా అరెస్టయ్యి, ప్రభుత్వం చేత 'ఎన్‌కౌంటర్' అయ్యే ప్రమాదాన్ని ఎదుర్కొన్న సందర్భాల్లో ఒక న్యాయవాదిగా ఆయన ఎందరినో కాపాడారు. ఎమర్జెన్సీ ఎత్తేసిన తర్వాత పత్తిపాటి ఒక న్యాయవాదిగా కొనసాగుతూ చివరి ఊపిరి దాకా 'పని హక్కు'ను ప్రాథమిక హక్కులలో భాగం చేయాలని డిమాండ్ చేస్తూ వచ్చారు. ఆయన చివరి వరకూ ప్రజా న్యాయవాదిగా కొనసాగారు.

ఎమర్జెన్సీని ఎత్తేసిన తర్వాత పత్తిపాటి పౌరహక్కుల ఉద్యమంలో క్రియాశీలంగా లేనప్పటికీ విప్లవోద్యమం పట్ల సానుభూతి కలిగివుంటూ, మార్క్సిజాన్ని విశ్వసిస్తూ వచ్చారు. ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల ఉద్యమంలో పత్తిపాటి పోషించిన పాత్రను ఎత్తిపడుతూ, అత్యంత చీకటిమయమైన నిర్బంధకాలాల్లో ఒకటైన 1970–77 మధ్య కాలంలో ఒక ప్రజా న్యాయవాదిగా ఆయన చేసిన కృషిని గుర్తు చేసుకుంటూ సీపీఐ (మావోయిస్టు) కేంద్రకమిటీ ఆయనకు ఘనంగా నివాళులర్పిస్తున్నది. పీడిత ప్రజల ప్రజాస్వామిక హక్కుల కోసం పత్తిపాటి వంటి కామ్రేడ్స్, పౌరహక్కుల సంస్థలు చేసిన కృషిని మా పార్టీ మొత్తంగా భూస్వామ్య విధానానికీ, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానానికీ, సామ్రాజ్యవాదానికీ వ్యతిరేకంగా, పీడిత ప్రజలకు అన్ని హక్కుల్ని హామీ ఇచ్చే నూతన ప్రజాస్వామ్య వ్యవస్థను నిర్మించడం కోసం సాగే పోరాటంలో విడదీయరాని భాగంగా చూస్తుంది. ఆపరేషన్ గ్రీన్ హంట్ పేరుతో 'ప్రజలపై యుద్ధం' రూపంలో భారత ఫాసిస్టు పాలకవర్గాలు అపూర్వస్థాయిలో దేశవ్యాప్త, బహుముఖ దాడిని కొనసాగిస్తున్న నేటి సందర్భంలో, ప్రజలూ, పౌరహక్కుల ఉద్యమాలూ అనేక సంవత్సరాలపాటు ఎన్నో ప్రయాసలకోర్చి సాగించిన ఉద్యమాల ఫలితంగా గెల్చుకున్న ప్రతి హక్కూ హరించివేయబడుతున్న సమయంలో, ఈ హక్కుల కోసం పోరాడిన పత్తిపాటి లాంటి పౌరహక్కుల నాయకుల సేవల్ని గుర్తు చేసుకోవడం చాలా అవసరం. దేశంలో పౌరహక్కుల ఉద్యమం మునుపెన్నటికన్నా క్రియాశీలంగా కొనసాగాల్సిన ఆవశ్యకత ముందుకొచ్చిన ప్రస్తుత సమయంలో ప్రజలలో పౌరహక్కుల విషయంలో నేడు నెలకొన్న మెరుగైన, ఉన్నతమైన ప్రజాస్వామిక చైతన్యాన్ని తేవడం కోసం పాటుపడ్డ వివిధ సంస్థలూ, వ్యక్తులూ చేసిన పోరాటాల్ని, అందించిన సేవల్ని ప్రచారం చేయాల్సిన అవసరం ఎంతో వుంది. దేశ పీడిత ప్రజల కోసం ఆయన చేసిన కృషిని ఆదర్శంగా స్వీకరించాలనీ, ప్రచారం చెయ్యాలనీ మా కేంద్రకమిటీ ఆయన కుటుంబసభ్యులకూ, స్నేహితులకూ, పౌరహక్కుల ఉద్యమ సహచరులకూ, ప్రజా న్యాయవాదులకూ విజ్ఞప్తి చేస్తున్నది. తద్వారా ఆ పోరాట వారసులుగా నేటి యువతరం ప్రజల హక్కుల కోసం పాటుపడేలా వుత్తేజం పొందగలరని మా కేంద్రకమిటీ భావిస్తున్నది.

**(అభయ్)**
**అధికార ప్రతినిధి**
**కేంద్ర కమిటీ**
**సీపీఐ (మావోయిస్టు)**